

ఇ-శ్రమ్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని అసంఘటిత రంగ కార్మికులు, వలస కార్మికులు ఇ-శ్రమ్ పోర్టల్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని కార్మిక శాఖ ప్రాంతీయ కమిషనర్ ఎం.రామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచితంగా ఇ-శ్రమ్ పోర్టల్ ద్వారా యూనివర్సల్ అకౌంటు నెంబర్ (యుఎఎన్) కేటాయించి, గుర్తింపు కార్డు జనరేట్ చేసి ఇస్తామన్నారు. ఆహార భద్రత పథకం ఉచితంగా కల్పించడం జరుగుతుందన్నారు. వలస కార్మికులకు రేషన్ కార్డు కావాలన్నా, ఎటువంటి సమస్యలు ఉన్నా దగ్గరలో ఉన్న కార్మిక శాఖ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని తెలిపారు. ప్రమాదవశాత్తూ మరణిస్తే పూర్తి అంగవైకల్యం కలిగిన కార్మికులకు రూ.2 లక్షలు ఆర్థిక సహాయం అందజేస్తామన్నారు.

డోలీపై వృద్ధుడిని వైద్యశిబిరాన్ని తీసుకొస్తున్న గిరిజనులు

డోలీపై జెఎఎస్ శిబిరానికి...

- 8కిలోమీటర్లు నడిచిన గిరిజన గర్భిణులు
- జిల్లేడువలస సచివాలయం వద్ద వైద్య శిబిరం
- ఏజెన్సీ గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి
- గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సీదరపు అప్పారావు

ప్రజాశక్తి - సాలూరు

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి డోలీ మోతలో గిరిజన రోగిని తీసుకొచ్చిన సంఘటన వెలుగులోకి వచ్చింది. సీదరపు పెద రాజయ్య అనే వృద్ధుడ్ని డోలీ మోతలో గిరిజనులు తీసుకొచ్చారు. ఐదుగురు గిరిజన గర్భిణులు 8 కిలోమీటర్ల దూరం నడుచుకొని వైద్య శిబిరం వద్దకు చేరుకున్నారు. మండలంలోని జిల్లేడువలస సచివాలయం వద్ద బుధవారం ఏర్పాటు చేసి వైద్య శిబిరానికి సమీపంలో ఉన్న ఏడు గిరిశిఖర గ్రామాల నుంచి గిరిజనులు హాజరయ్యారు. వారంతా కాలినడకన రాళ్లు, రప్పలు దాటుకుంటూ కొండలపై నుంచి కిందకు వచ్చారు. నారింజపాడు, బొడ్డపాడు, కొండవలస, బెల్లపాక, బి.కొత్తూరు, కె.కొత్తవలస గ్రామాల నుంచి 150మంది గిరిజనులు కాలినడకన హాజరయ్యారు. ఒకవైపు ప్రభుత్వం ప్రజల ఇళ్ల వద్దకే వైద్య సేవలు అందిస్తున్నామని గొప్పలు చెప్పుకొంటున్న తీరు గిరిశిఖర గ్రామాల ప్రజలను వెక్కిరిస్తోంది. స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లయినా గిరిశిఖర గ్రామాలకు కనీస రహదారి సౌకర్యం లేని పరిస్థితి ఏర్పడింది. సచివాలయానికి వివిధ పనుల కోసం రావాలన్నా వీరంతా కాలికి బుద్ధి చెప్పాల్సిందే. ఈ గ్రామాలను కలుపుతూ బిటి రోడ్డు నిర్మించాలని గిరిజనులు అనేక సార్లు కోరుతున్నా ప్రభుత్వం నుంచి స్పందన కరువైంది. ఈ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించినా నిధులు మంజూరు కాలేదు. నవరత్నాలనే సంక్షేమ పథకాలతో గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపామని చెప్పుకొనే పాలకుల మాటలు నీటి మూటలు గానే మిగులుతున్నాయి. ఇప్పటికే నారింజపాడు నుంచి జిల్లేడువలసకు నాలుగు కిలోమీటర్ల దూరం వరకు రూ.3లక్షలు సొంత డబ్బుతో గిరిజనులు మట్టిరోడ్డు నిర్మించుకున్నారు. నారింజపాడుకు చెందిన 56గిరిజన కుటుంబాలు తలా రూ.6వేలు ఎత్తుకుని రోడ్డు నిర్మాణం చేపట్టారు. గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తమ పంచాయతీ పరిధిలో ఉన్న గ్రామాలకు బిసి రోడ్లు నిర్మాణానికి మంజూరైన నిధులు చాలవని, మట్టిరోడ్లు నిర్మాణానికి అనుమతి మంజూరు చేయాలని గిరిజనులు కోరుతున్నారు. ఈ మేరకు వైద్య శిబిరం వద్దకు హాజరైన వైసిపి ఎంపిటిసి సభ్యులు గెమ్మెల సుబ్బారావును గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సీదరపు అప్పారావు కోరారు. సంక్షేమ పథకాల పేరుతో ఎన్ని వందల కోట్లు ఖర్చు చేసినా గిరిజన గ్రామాలకు ప్రయోజనం లేదని, రహదారి, విద్యుత్, తాగునీరు సరఫరా వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తే మంచిదని అప్పారావు అధికారులతో చెప్పారు.

పార్వతీపురంలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి

- ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్
- ముగిసిన విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్/రూరల్

జిల్లాలో గల ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో వేలాది మంది విద్యార్థులు చదువుతున్నప్పటికీ జిల్లా కేంద్రంలో యూనివర్సిటీ లేకపోవడం, రాష్ట్ర ప్రభుత్వం నిర్మించకపోవడం దుర్మార్గమని, వెంటనే దీనిపై ప్రకటన చేసి యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఎస్‌ఎఫ్‌ఐ చేపడుతున్న విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర బుధవారంతో ముగిసిన సందర్భంగా స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ కూడలి నుంచి మెయిన్ రోడ్డు మీదుగా పాతబస్టాండ్ వరకు విద్యార్థులతో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యాసంస్థ నిర్వీర్యం చేసేలా తమ విధానాలను అనుసరిస్తున్నాయని మండిపడ్డారు. విద్యార్థుల భవిష్యత్తుకు మేలు చేసేలా అనేక రకాల సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్న జగనన్న ప్రభుత్వం మెరుగైన విద్యను అందించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. జిల్లా కేంద్రంలో యూనివర్సిటీ లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లి చదవలేక, చదువులు మధ్యలోనే నిలిచిపోయే పరిస్థితి కనిపిస్తుందన్నారు. జిల్లాకో ఎయిర్ పోర్టులను ప్రకటించిన జగన్ జిల్లాకో యూనివర్సిటీ ప్రకటించకపోవడం దుర్మార్గమన్నారు. దేశంలో మోడీ, రాష్ట్రంలో జగన్ విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. సంక్షేమ హాస్టళ్లకు బకాయిలుగా నిలిచిన మెస్ (డైట్) బిల్లులు వెంటనే విడుదల చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ బిల్లులు పెంచాలని, ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తొలగించాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలని, మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని, డిగ్రీలో తీసుకువచ్చిన హనర్స్ - మైనర్ సబ్జెక్టు విధానాన్ని రద్దు చేయాలని, డిగ్రీ విద్యార్థులు ఇంటర్న్ షిప్‌లో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, విద్యార్థులకు స్టైఫండ్ ఇవ్వాలని, 117 జిఒ రద్దు చేయాలని, పాఠశాలల విలీనం ఆపాలని, ఖాళీగా ఉన్న అధ్యాపక, ఉపాధ్యాయ

రాలీని ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్

పట్టణంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

పోస్టులను భర్తీ చేయాలని, హాస్టళ్లలో పర్మినెంట్ వర్కర్లను, వార్డెన్లను నియమించాలని, పోస్టుమెట్రిక్ హాస్టల్‌కు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని, హాస్టళ్లలో ఎఎన్‌ఎంలను నియమించాలని, నిరంతరం మెడికల్ క్యాంపులు నిర్వహించాలని, కురుపాం ఇంజనీరింగ్ కళాశాల పనులు త్వరితగా పూర్తి చేయాలని, నిర్వాసిత రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమ హాస్టళ్లకు ఆర్‌ఒ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని, గురుకులం, ఆశ్రమ, కెజిబివి, ఏకలవ్య పాఠశాలల్లో, హాస్టళ్లలో సీట్లు పెంచాలని, నిధులు కేటాయించి అభివృద్ధి చేపట్టాలని, మంచినీరు, మరుగుదొడ్లు, లైట్లు ఫ్యాన్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని, హై స్కూల్, యుపి పాఠశాలల్లో అన్ని పోస్టులు కొనసాగించాలని, సిఆర్టీ, భాష వాలంటీలను రెగ్యులరైజేషన్ చేయాలని, యువజన శిక్షణ కేంద్రాలలో సీట్ల సంఖ్య పెంచాలని, ప్లేస్మెంట్లను అందుబాటులో గల పరిశ్రమలల్లో కల్పించాలని, జిల్లాలో మూతపడిన పరిశ్రమలను తెరిపించి, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, మెడికల్ కళాశాలకు స్థలం కేటాయించి పనులు వెంటనే ప్రారంభించాలని జిల్లా కేంద్రంలో ఐటిఐ కళాశాల ఏర్పాటు చేయాలని తదితర డిమాండ్లు పరిష్కారం చేయాలని, లేనిచో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష్య కార్యదర్శులు డి. పండు, పి.రాజశేఖర్ మాట్లాడుతూ పై సమస్యల పరిష్కారానికి నవంబర్ 1నుంచి 8వరకు పార్వతీపురంలో రిలేనిరాహారదీక్షలు, 9న చలో కలెక్టరేట్ నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యవర్గసభ్యులు కె. రాజు, హెచ్.సింహాచలం, బి.గంగారావు, కె.భాస్కరరావు, నాయకులు అఖిల్, ఉమాశంకర్, సిసింద్రీ, అన్నాజీ, వెంకీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇవిఎంల తనిఖీలకు హాజరు కావాలి: జెసి

ప్రజాశక్తి - పార్వతీపురం

ఇవిఎంల మొదటి దశ తనిఖీలు ఈ నెల 16నుంచి ప్రారంభం కానున్న దృష్ట్యా అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు తప్పకుండా హాజరు కావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అర్.గోవింద రావు కోరారు. స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఓటరు పునశ్చరణ, ఇతర ఎన్నికల సంబంధిత అంశాలపై రాజకీయ పార్టీ ప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాలెట్ యూనిట్ లు 3250, కంట్రోల్ యూనిట్లు 2560, వివిపాట్ లు 3170 కేటాయించారని అందులో ఒక వివిపాట్ మినహా మిగిలినవి జిల్లాకు చేరాయని చెప్పారు. వీటి మొదటి దశ తనిఖీలు ఈ నెల 16వ తేదీ నుండి 20 రోజుల పాటు తనిఖీలు చేయనున్నట్టు తెలిపారు. ఇవిఎంల వినియోగంలో ఎటువంటి అపోహలు ఉన్నా నిపుణులు నివత్తి చేస్తారని తెలిపారు. ఈనెల 27న సమీకృత ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ జరుగుతుందన్నారు. అక్టోబరు 27 నుండి డిసెంబరు 9 వరకు క్లైమ్స్, అభ్యంతరాలు స్వీకరణ జరుగుతుందని, డిసెంబరు 26 నాటికి వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. సమావేశంలో హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ డి.రవికుమార్, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మెప్మా ఉద్యోగులు

మెప్మా ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి - సాలూరు

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ మెప్మా ఉద్యోగులు, యానిమేటర్లు బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు, మెప్మా ఉద్యోగులు, యానిమేటర్ల సంఘం అధ్యక్షులు నాగిరెడ్డి సుగుణమ్మ, కార్యదర్శి అన్నపూర్ణ ఆధ్వర్యాన బోసు బొమ్మ జంక్షన్ నుంచి ప్రధాన రహదారి మీదుగా ర్యాలీ చేపట్టారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. మెప్మా ఉద్యోగులకు సంబంధించిన సర్క్యులర్ 64ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26వేలు చేయాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. గత ఎన్నికల ముందు సిఎం జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ టి.జయరాంకి వినతిపత్రం అందజేశారు.

పోలీసు స్టేషన్ సందర్శన

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక పోలీస్ స్టేషన్‌ను పాలకొండ డిఎస్‌పి జివి కృష్ణారావు బుధవారం సందర్శించారు. స్టేషన్ పరిసరాలను, రికార్డులను క్షుణంగా పరిశీలించారు. కేసులకు సంబంధించిన ఫైల్స్ అప్డేట్‌గా ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. పోలీసులను వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డిఎస్‌పి వెంట ఎస్‌ఐ ఎ.నీలకంఠరావు ఉన్నారు.

గిరిజన ఉత్పత్తులు అంతర్జాతీయ స్థాయికి చేరాలి

ప్రజాశక్తి - బెలగాం

గిరిజన ఉత్పత్తులను పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

గిరిజనులు పండించే పంటలు, ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయి మార్కెట్‌లో విక్రయాలు జరగాలని ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి సి.విష్ణుచరణ్ ఆకాంక్షించారు. స్థానిక గిరిమిత్ర సమావేశ మందిరంలో గిరిజన కళాకారుల ఉత్పత్తుల మేళా కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి పిఒ ముఖ్య అతిధిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు పండించే పంటలు, ఉత్పత్తులకు మంచి గిరాకీ ఉందని, అయితే దళారులు, మధ్యవర్తుల ద్వారా సరైన ధరను పొందలేకపోతున్నారని గుర్తుచేశారు. ఇందుకోసం వన్‌ధన్ వికాస్ కేంద్రాల (విడివికె)ను జిల్లాలో ఏర్పాటు చేసి గిరిజన ఉత్పత్తులు మంచి ధరకు విక్రయించేలా చేసినట్లు చెప్పారు. తద్వారా తమ పంటలు, ఉత్పత్తులకు అధిక లాభాలను ఆర్జించి, ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేందుకు దోహదపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో 54 వరకు విడివికెలు ఉండగా, అందులో 34 మాత్రమే పనిచేస్తున్నాయన్నారు. గిరిజనుల ఉత్పత్తుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్నివిధాలా సహకరిస్తున్నప్పటికీ కొన్ని విడివికెలు పనిచేయడం లేదని, వీటిపై అవగాహన పెంపొందించుకొని సంపూర్ణంగా వినియోగించుకొనేలా చేయడమే దీని ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. విడివికెలను ప్రోత్సహించేందుకు ఒక్కో గ్రూపుకు లక్ష రూపాయల వరకు రుణ సదుపాయం కల్పిస్తున్నామని, తద్వారా అధిక లాభాలను ఆర్జించాలన్నదే తమ ధ్యేయమని వివరించారు. అవసరమైతే మరిన్ని నిధులను వెచ్చించేందుకు సిద్ధంగా ఉన్నామని, తమకు నచ్చిన పనుల్లో పురోగతి సాధించాలని ఆయన కోరారు. గిరిజన ఉత్పత్తులకు రాష్ట్రంలోనే కాకుండా జాతీయ, అంతర్జాతీయ మార్కెట్ కు చేరాలని ఆయన అభిలషించారు. ఇందుకు అవసరమైన సహకారాన్ని ట్రైఫెడ్ అందజేస్తుందని తెలిపారు. గిరిజనులకు అండగా ఐటిడిఎ ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం వివిధ విడివికెలు ఏర్పాటు చేసిన పలు స్టాళ్లను సందర్శించారు. కార్యక్రమంలో ట్రై ఫెడ్ ప్రాంతీయ మేనేజర్ ఎస్.శ్రీనివాస్, ఐటిడిఎ ఎపిఒ పి.మురళీధర్, జిసిసి డిఎం వి.మహేంద్రకుమార్, ఎపిడి వై.సత్యనారాయణ, వివిధ విడివికె సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సిఎం జగన్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

జోగారావుకే వైసిపి టిక్కెట్..?

నియోజకవర్గంలో జోరుగా ప్రచారం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావుకే మళ్లీ వైసిపి టిక్కెట్టును ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఖరారు చేసినట్టు నియోజకవర్గంలో బుధవారం జోరుగా ప్రచారం జరుగుతోంది. అమరావతిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో వైసిపి అధినేత, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కలిశారు. ఈ సందర్భంలో 2024 జరగబోయే ఎన్నికల్లో మళ్లీ టికెట్ నీకేనంటూ జగన్ భరోసా ఇచ్చారనే వార్త పార్వతీపురం నియోజకవర్గంలో ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ విషయాన్ని ఆయన క్యాంపు కార్యాలయం కూడా నిర్ధారించడం త ఆయన అభిమానుల్లో ఉత్సాహం ఊపందుకుంది. అయితే ఈ విషయమై పార్వతీపురం టిక్కెట్‌ను ఆశిస్తున్న ఆశావహులు మాత్రం, పార్టీ ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, ఒకవేళ అదే నిజమైతే పత్రికా ముఖంగా ప్రకటిస్తారని, ఈ వార్తను ఖండిస్తున్నామని అంటున్నారు.

ఆరోగ్యశ్రీపై ప్రజలకు అవగాహన కల్పించాలి : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

ఆరోగ్యశ్రీ పథకంపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి అన్నారు. బుధవారం శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం ప్రయోజనాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. వైద్య సిబ్బందికి కూడా ఆరోగ్యశ్రీ పథకంపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన వ్యాధులన్నింటికీ ఆరోగ్యశ్రీ వర్తించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్లు డాక్టర్ కొయ్యాన అప్పారావు, డాక్టర్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కె పాడు పనులు పూర్తిచేయాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఎస్కే పాడు టూరిజం పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్ అన్నారు. మండలంలోని సవరకోటపాడు హార్టికల్చర్, నర్సరీలో నిర్మితమవుతున్న టూరిజం కేంద్రాన్ని ఐటిడిఎ పిఒ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన హెచ్‌ఎన్‌టిసిలో జరుగుతున్న కాటేజీలు తదితర అభివృద్ధి పనులను సందర్శించారు. నిర్మాణ పనుల్లో మార్పులు, చేర్పులకు తగు సూచనలు ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు. ఈ పనులు ఈ నెలాఖరులో పూర్తి చేయాలని, ఎస్‌కె పాడు హార్టికల్చర్, నర్సరీని టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఆయన వెంట జిల్లా గిరిజన సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ జె.శాంతేశ్వరరావు, భద్రగిరి డిఇ సింహాచలం, అసిస్టెంట్ ఇంజనీర్ అప్పారావు, తదితరులు ఉన్నారు.

మౌలిక వసతుల కల్పనే ధ్యేయం

- వైద్య కళాశాలకు రూ.405 కోట్ల సహాయం
- జిల్లాలో వైద్య వసతుల కల్పనకు రూ.692 కోట్లు
- జల్‌జీవన్ మిషన్ కింద రూ.177 కోట్లు
- నాబార్డు జనరల్ మేనేజర్ పి.జయకన్నన్
- వైద్య కళాశాల పనులపై సంతృప్తి

జెజెఎం కుళాయిని పరిశీలిస్తున్న నాబార్డు జిఎం జయకన్నన్

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో వైద్యం, విద్య, తాగునీటి సరఫరాకు సంబంధించి మౌలిక వసతులు కల్పించే ప్రాజెక్టులకు నాబార్డు పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం అందిస్తున్నట్టు జనరల్ మేనేజర్ పి.జయకన్నన్ వెల్లడించారు. నగరంలోని గాజులరేగలో ప్రభుత్వ వైద్య కళాశాలను బుధవారం ఆయన పరిశీలించారు. ప్రిన్సిపల్ ఛాంబరులో వైద్య మౌలిక వసతుల సంస్థ అధికారులతో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో నాబార్డు ఆర్థిక సహాయంతో చేపడుతున్న ఆస్పత్రుల, వైద్య కళాశాలల నిర్మాణ పనులపై సమీక్షించారు. ప్రస్తుత స్థితిగతులను తెలుసుకున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి రూ.49 కోట్లు ఇస్తున్నారని, ప్రస్తుతం పునాదుల స్థాయిలో నిర్మాణం ఉందని వైద్య మౌలిక వసతుల సంస్థ ఎస్‌ఇ శివకుమార్ వివరించారు. భద్రగిరి, సాలూరు, కురుపాంలో ఆస్పత్రుల నిర్మాణాలు వచ్చే రెండు మూడు నెలల్లో పూర్తి చేస్తామని ఎస్‌ఇ తెలిపారు. విజయనగరం జిల్లాలో ఎస్.కోట, గజపతినగరం ఆస్పత్రుల నిర్మాణ పనులు వచ్చే ఏడాది ఫిబ్రవరికి పూర్తిచేస్తామని చెప్పారు. నెల్లిమర్లలో వచ్చే నెలకు, బాడంగిలో డిసెంబరుకల్లా ఆస్పత్రుల నిర్మాణ పనులు పూర్తవుతాయని వివరించారు.

నాబార్డు సహాయంతో చేపట్టే పనులకు నిధుల విడుదల సమస్య లేదని, క్లెయిమ్ చేసిన మరుసటి రోజే విడుదల చేస్తామని జిఎం కన్నన్ చెప్పారు. అనంతరం వైద్య కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులతో నాబార్డు జిఎం ముచ్చటించారు.

అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ వైద్య కళాశాల ఏర్పాటుకోసం నాబార్డు ద్వారా రూ.405 కోట్లు అందజేస్తున్నట్టు చెప్పారు. డిసెంబరు 2024 నాటికి ఇక్కడి వైద్యకళాశాల నిర్మాణం పూర్తి కావలసి ఉందని, ఇప్పటికే 60 శాతం వరకు పనులు పూర్తయ్యాయని చెప్పారు. జిల్లాలో 121 అంగన్‌వాడీ భవనాలు, 123 పాఠశాల భవనాల నిర్మాణానికి కూడా నాబార్డు ఆర్థిక సహాయం అందజేస్తున్నట్టు తెలిపారు. జల్‌జీవన్ మిషన్ కింద గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా పనుల కోసం రూ.177 కోట్లు అందిస్తున్నామని వివరించారు. జిల్లాలో 97 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గిడ్డంగులను నిర్మించేందుకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా ఆర్థిక సహాయం అందించామని వెల్లడించారు. పర్యటనలో నాబార్డు కన్సల్టెంట్ తోట ప్రభాకరరావు, జిల్లా మేనేజర్ నాగార్జున, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ కె.పద్మలీల, వైద్య మౌలిక వసతుల సంస్థ ఇఇ ప్రసాద్, డిఇ శివకుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ బి.ఉమాశంకర్, ఇఇ ఎ.వి.ఎస్.రాజన్, చీపురుపల్లి డిఇఇ వై.గోవింద రావు పాల్గొన్నారు.

వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ అవార్డుకు బొబ్బిలి వీణ నామినేషన్

విజయనగరం : వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ అవార్డుకు బొబ్బిలి వీణ నామినేట్ అయింది. దీంతో ఇన్వెస్ట్ ఇండియా పరిశీలన బృందం గురువారం బొబ్బిలికి రానున్నట్లు జిల్లా చేనేత అధికారి మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం బొబ్బిలి సందర్శన, శుక్రవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్‌లో భాగంగా బొబ్బిలి వీణ విశిష్టతపై చర్చిస్తారని తెలిపారు.

కళ్లకు కనబడటం లేదా?

మాజీ ఎమ్మెల్యే మీసాల గీత

విజయనగరం : రాష్ట్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం వాస్తవాలు ప్రభుత్వానికి కళ్లకు కనబడటం లేదా? అని మాజీ ఎమ్మెల్యే మీసాల గీత ప్రశ్నించారు. బుధవారం స్థానిక ఆర్‌కె డిగ్రీ కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా లబ్ధిపొందిన విద్యార్థులతో ఆమె మాట్లాడారు. అనంతరం బాబుతో నేను అనే పోస్ట్ కార్డుపై సంతకాల సేకరణ చేపట్టారు.

నేడు సామూహిక గృహ ప్రవేశాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

పార్వతీపురం, అక్టోబర్ 11 : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నవరత్నాలు పేదలందరికీ ఇల్లు (ఎన్పిఐ) సామూహిక గహ ప్రవేశాల కార్యక్రమం గురు వారం లాంఛనంగా ప్రారంభం కానుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి కాకినాడ జిల్లా సామర్లకోటలో ప్రారంభించనున్నారు. ఇందులో భాగంగా పార్వతీపురం మండలం కృష్ణపల్లిలో ప్రారంభించనున్నట్టు కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. జిల్లాలో 27,142 గృహాలు మంజూరు కాగా, వీటిలో 12046 ఇళ్ల నిర్మాణం పూర్తయ్యాయన్నారు. జిల్లాలో రూ.269 కోట్ల ప్రాజెక్టు వ్యయంతో ఇళ్ల నిర్మాణం జరుగుతుండగా నేడు జిల్లా స్థాయిలో కృష్ణపల్లిలో కార్యక్రమం ప్రారంభిస్తున్నట్టు తెలిపారు.

రాష్ట్రస్థాయి హాకీ క్రీడలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - సీతంపేట

రాష్ట్రస్థాయి హాకీ క్రీడలకు అండర్-14, అండర్-17 ఎన్ టి ఆర్ గ్రీన్ ఫీల్డ్ స్టేడియం సీతంపేట లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెలాఖరున అనకాపల్లిలో రాష్ట్రస్థాయిలో జరుగు హాకీ క్రీడల పోటీలకు గిరిజన విద్యార్థులు జిల్లా స్థాయిలో జరిగిన ఎంపికలకు అధిక స్థాయి గిరిజన విద్యార్థులు ఎంపికయ్యారు. వీరిలో సీతంపేట ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల, కెజిబివి, భామిని గిరిజన విద్యార్థులు, సీతంపేట మల్లి బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులు, సీతంపేట గురుకుల విద్యార్థులు ఉన్నారు. వీరికి గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో ప్రత్యేకమైన శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఐటిడిఎ స్పోర్ట్స్ ఇన్‌ఛార్జి ఎన్.జాకబ్ దయానందం, కోచ్ రాజేష్ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

మెరుగైన వైద్యమే ప్రభుత్వ లక్ష్యం : పిఒ



సమావేశానికి హాజరైన నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జులు

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జులతో సమీక్ష

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

తెలుగుదేశం పార్టీ అరుకు పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో గల అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌ఛార్జులతో ఆ పార్టీ జోనల్ ప్రోగ్రాం కమిటీ కన్వీనర్ దామచర్ల సత్యం సమీక్షించారు. విశాఖలోని టిడిపి కార్యాలయంలో అరకు పార్లమెంట్ అధ్యక్షులు గుమ్మడి సంధ్యారాణి, కురుపాం, రంపచోడవరం, పాడేరు, అరకు, పార్వతీపురం, పాలకొండ నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు తోయక జగదీశ్వరి, వంతల రాజేశ్వరి, గిడ్డి ఈశ్వరి, కేదారి శ్రావణ్, బోనెల విజయచంద్ర, నిమ్మక జయకృష్ణ పాల్గొన్నారు.

నౌగూడలో అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

రక్తహీనతపై అవగాహన

ప్రజాశక్తి - సీతంపేట

రక్తహీనతపై మండలంలోని నౌగూడలో రక్తహీనత నివారణపై సీతంపేట బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులచే నాటిక రూపంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తహీనత అధిగమించడానికి ఎటువంటి పౌష్టికాహారం, ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి వంటి విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ ఎ.లిల్లీరాణి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నేటి బాలలే రేపటి తరానికి అభివృద్ధి కారకులు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

నేటి బాలలే రేపటి తరానికి అభివృద్ధి కారకులని పట్టణ ఎస్ఐ దినకర్ అన్నారు. ప్రపంచ బాలికల దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ వృద్ధమిత్ర కోఆర్డినేటర్‌గా పనిచేయుచున్న కె.కృష్ణమూర్తి స్థానిక ఇందిరా గాంధీ మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 40 మంది బాలికలకు ఎస్ఐ సమక్షంలో నోట్‌బుక్కులు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేస్తూ ఆ పాఠశాలలో పనిచేసిన ఆయాకు చీరలు ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం గౌరునాయుడు, ఉపాధ్యాయులు రఘు, చిన్నారావు, గౌరీ శంకర్రావు, వర్డ్ వార్డ్ కౌన్సిలర్ ఆనంద్ పాల్గొన్నారు.

రహదారి పూర్తి చేయండి

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని మర్రిపాడు పంచాయతీ ఎగువ ద్వారబందం, దిగువ ద్వారబందం, నడిమి ద్వారా బందం గ్రామాల రహదారిని వెంటనే పూర్తి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర తలిన రహదారితో గిరిజనులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు ముడేళ్ల గడిచిన రహదారి పూర్తి చేయలేదన్నారు. అధికారులు స్పందించి రహదారి పూర్తి చేయాలన్నారు.

విద్యార్థులకు బాల్సు, నెట్లు పంపిణీ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని భద్రగిరి ఎపి గిరిజన గురుకుల బాలుర కళాశాలలో ఎలిస్‌పేట సిఐ సత్యనారాయణ కమ్యూనిటీ పోలిసింగ్‌లో భాగంగా గిరిజన విద్యార్థులకు వాలీబాల్ నెట్లు, బాల్ అందజేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ, విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ షణ్ముఖరావు, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ యుగంధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పిఎసిఎస్ ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఆర్థిక అభివృద్ధి సాధించడానికి రైతులు సహాయ సహకారాలు అందించాలని సాలూరు సహకార సంఘాల సబ్ డివిజనల్ అధికారి జి.రామకృష్ణ కోరారు. మండలంలోని మామిడిపల్లి పిఎసిఎస్ మహాజనలో ఆయన మాట్లాడారు. పిఎసిఎస్‌లు ప్రభుత్వ బ్యాంకులు అన్ని రకాలైన రుణాలు ఇస్తున్నందున, తీసుకున్న రుణాన్ని సకాలంలో చెల్లించి సహకార సంఘం అభివృద్ధిలో రైతులు ముందుండాలని అన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు పెద్దింటి మాధవరావు, సర్పంచ్ ప్రతినిధి రామకృష్ణ, మాజీ అధ్యక్షులు తాడుతూరి తిరుపతిరావు, బూసి తవుడు, తిరుపతి రావు, సభ్యులు రైతులు పాల్గొన్నారు.

చేపపిల్లలు విడుదల

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలోని అన్నరాజువలసలో వెంగళరాయ ప్రాజెక్టులో చేప పిల్లలను జిల్లా మత్స్య శాఖ అధికారులు, వైఎస్ఎంపిపి రెడ్డి సురేష్ విడుదల చేశారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కార్యక్రమంలో భాగంగా సుమారు 5.94 లక్షల చేపపిల్లలను లైసెన్స్ పథకంలో భాగంగా 2 లక్షల చేప పిల్లలను ప్రాజెక్టులో విడుదల చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి సువ్వాడ గుణవతి, ఎంపిడిఒ, పార్వతీపురం, విజయనగరం జిల్లాల మత్స్య శాఖాధికారులు జి.నిర్మలకుమారి, వేమల తిరుపతయ్య, జిల్లా మత్స్య కార సంఘం అధ్యక్షులు చినఅప్పన్న, దాసరి లక్ష్మణరావు, విఆర్ఎస్ గిరిజన మత్స్యకార సంఘం అధ్యక్షులు సురపాటి ఆదినారాయణ, సర్పంచ్ సీమల రాములమ్మ, ఎంపిటిసి సభ్యులు అనూష, మత్స్యకారులు పాల్గొన్నారు.

వీరఘట్టం ఎంపిడిఒగా వెంకటరమణ

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా వై.వెంకటరమణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎంపిడిఒ జెజె ప్రసాద్ అనారోగ్య కారణంగా సెలవుపై వెళ్లడంతో మండల పరిషత్తు పరిపాలన అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న వై వెంకటరమణకు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు జిల్లా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ మండల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

అగ్నిమాపక పరికరాల ప్రదర్శన

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు ఆధ్వర్యాన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బందికి, వినియోగదారులకు అగ్నిమాపక పరికరాలు, వీటిపై తెలియజేసే పరికరాలు ప్రదర్శించారు. వీటిని ఎలా ఉపయోగించాలో వివరించారు. కార్యక్రమంలో ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ హిమాంశు శేఖర్ బెహరా, డిప్యూటీ మేనేజర్ జె.రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ కమిటీ సభ్యులకు గుర్తింపు కార్డులు

ప్రజాశక్తి - సాలూరు

గుర్తింపు కార్డులను అందజేస్తున్న జెసి గోవిందరావు

జిల్లా నాయీ బ్రాహ్మణ సంక్షేమ కమిటీ సభ్యులకు బుధవారం జాయింట్ కలెక్టర్, బిసి సంక్షేమ కమిటీ చైర్మన్ ఆర్.గోవిందరావు గుర్తింపు కార్డులు మంజూరు చేశారు. నాయీ బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ చిప్పాడ రామారావు ఆధ్వర్యాన జిల్లా సంక్షేమ కమిటీ సభ్యులు జెసి చేతుల మీదుగా గుర్తింపు కార్డులు అందుకున్నారు. సంక్షేమ కమిటీ సభ్యులు పట్నాన శంకరరావు, బుర్రి రమణ, తుత్తురుపూడి వరప్రసాద్, భవానీలకు గుర్తింపు కార్డులు అందజేశారు. నాయీ బ్రాహ్మణ సంక్షేమ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు చైర్మన్ గోవిందరావును కోరినట్టు నాయీ బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ చిప్పాడ రామారావు తెలిపారు.

ప్రజాశక్తి - వీరఘట్టం

గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కల్పనా కుమారి అన్నారు. మండలంలోని తలవరంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలించారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలకు ప్రజలు వచ్చి తనిఖీలు నిర్వహించి మెరుగైన వైద్యం పొందాలని ప్రజలను కోరారు. అనంతరం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా అంగన్వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్ మధుసూదనరావు, తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ, వైద్యాధికారులు ఎ.మానస, పి.ఉమామహేశ్వరి, వెంకటరమణ, సచివాలయ కార్యదర్శి నారాయణరావు, వైద్య, సచివాలయ సిబ్బందితో పాటు గ్రామ వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు. అలాగే వీరఘట్టంలోని శైత రామారావు పేట, ఊజుల, మర్రి, శైత తదితర వీధుల్లో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది రక్తపోటు మధుమేహ తదితరమైన వ్యాధిగ్రస్తులకు తనిఖీలు నిర్వహించి వారి పేర్లను నమోదు చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

పాలకొండ : మండలంలోని గొట్టమంగళాపురంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ కల్పనా కుమారి పాల్గొన్నారు. వైద్యశిబిరానికి హాజరైన రోగులతో మాట్లాడి వారికి అందుతున్న సేవలను అడిగారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : మండలంలోని తోటపల్లిలో జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ మరిశర్ల బాపూజీనాయుడు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరాలను పరిశీలించి వైద్య సమయం నిమిత్తం వచ్చే పలువురి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాపూజీనాయుడు మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తలపెట్టారన్నారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ కెకె సాగర్ వర్మ, వైద్య సేవలుఅందించారు. కార్యక్రమంలో విశాఖ కెజిహెచ్ వైద్యులు ఎఎస్ దివ్య, జనరల్ మెడిసిన్, డాక్టర్ డి.పార్థిబన్, ఎంపిడిఒ జి.పైడితల్లి, ఇఒపిఆర్‌డి గోపాలకృష్ణ, ఎఒ ఎన్.అర్జున్‌రావు, సర్పంచ్ ఆవాల సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : మండలంలోని బందలుప్పి పిహెచ్‌సి పరిధిలోని జమదాలలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శిబిరాన్ని ఎంపిపి మజ్జి శోభారాణి సందర్శించి రోగులతో మాట్లాడి వైద్యం అందుతున్న తీరును గమనించారు. ఈ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ శివనారాయణ, స్థానిక సర్పంచ్ రెడ్డి భారతి, ఎంపిటిసి శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి బంకురు రవికుమార్, వైసిపి మండల అధ్యక్షులు బొమ్మి రమేష్, నాయకులు బంకపల్లి రామకృష్ణ, ప్రభుత్వ వైద్యాధికారులు, వైద్యులు, సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లు, స్థానిక ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పాచిపెంట : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం

పాచిపెంట : సభలో మాట్లాడుతున్న ఎంపిపి ప్రమీల

గరుగుబిల్లి :మందుల వివరాలను పరిశీలిస్తున్న జెడ్‌పి వైస్‌చైర్మన్ బాపూజీనాయుడు

చేసుకోవాలని ఎంపిపి బి.ప్రమీల కోరారు. మండలంలోని పద్మాపురంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 512 మందికి వైద్య సేవలందించి అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో గొట్టాపు ముత్యాల నాయుడు, పి.వీరమనాయుడు, రవీంద్రనాథ్, దండి ఏడుకొండలు, బి.వీరయ్య, డిప్యూటీ డిఎంహెచ్ఒ శివకుమార్, ఎంపిడిఒ లక్ష్మీకాంత్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని గుచ్చిమి గ్రామ సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు, మండల ప్రత్యేక అధికారి కె.రామచంద్రరావు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా పేదలకు మెరుగైన వైద్యం అందించడం జరుగుతుందన్నారు. కావున సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య అధికారులు శిరీష, ఉషారాణి, రమాకాంత్, అపర్ణ, సర్పంచ్ ఎం.శ్రీదేవి, ఎంపిటిసి సభ్యులు జగదీష్, జెడ్‌పిటిసి సభ్యులు ఎం.బాబ్జీ, ఎంపిపి ప్రతినిధి బి.శ్రీరాములు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టు అప్రజాస్వామికం

ప్రజాశక్తి - బలిజిపేట

టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అరెస్టు అప్రజాస్వామికమని, ఆయన్ను విడుదల చేసేంతవరకు పోరాటం ఆగేది లేదని మండల టిడిపి అధ్యక్షులు పెంకి వేణుగోపాల్ నాయుడు అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి గుడి ఎదురుగా చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసన తెలిపారు. చంద్రబాబు నాయుడు అరెస్టు ప్రజా విరుద్ధం కాబట్టి తమకు పవన్‌కల్యాణ్ మద్దతు ఇచ్చారన్నారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు శంబంగి రాధాకృష్ణ, క్లస్టర్ ఇన్‌ఛార్జులు ఎస్.రాంబాబు, జి.బాబ్జీ, జి.సింహాచలం, వి.సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా జియమ్మ వలస మండలం ఇటికలో బుధవారం సాయంత్రం బాబుతో నేను కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్ గురించి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరికీ వివరించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు పల్ల రాంబాబు, అరుకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, ఎంపిపి బొంగు సురేష్, అరుకు పార్లమెంటు కొప్పలవెలమ సాధికార సమితి అధ్యక్షులు మూడడ్ల సత్యంనాయుడు, ఎస్టీ సెల్ అరుకు పార్లమెంటు అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గిరిజనుల హక్కుల కోసం పోరాటానికి సిద్ధం

ప్రజాశక్తి - కురుపాం

ఆదివాసీ గిరిజనుల హక్కుల కోసం నిరంతరం అలుపెరగని పోరాటాలు చేయడానికి గిరిజనులంతా సిద్ధంగా ఉండాలని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కోలక అవినాష్ అన్నారు. మండలంలోని నీలకంఠాపురంలో గిరిజన సంఘం నాయకులు బి.వెంకట్రావు ఆధ్వర్యంలో గిరిజన సంఘం ఏడో మండల మహాసభలు బుధవారం జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల హక్కులను కాలరాస్తున్నాయని, కావున గిరిజనులంతా ఏకతాటిపైకి వచ్చి నిరంతరంగా పోరాటాలకు సిద్ధంగా ఉండాలని అప్పుడే హక్కులు సాధించగలమని అన్నారు. అనంతరం గిరిజన సంఘం మండల నూతన కమిటీని 15 మంది సభ్యులతో

మహాసభలో మాట్లాడుతున్న ఎపి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి అవినాష్

మండల అధ్యక్షులుగా వి.వాసు, కార్యదర్శిగా బి.అనిల్, సహాయ కార్యదర్శి వెంకట్రావు, కోశాధికారి భాస్కరావు, ఉపాధ్యక్షులు వెంకట్రావు, సహాయ కార్యదర్శి కె.సుజాత ఎన్నుకున్నారు. కొండపోడు పట్టాలు సాధన, మినీగెడ్డలపై చెక్కుడాముల నిర్మాణం, జీడీకి మద్దతు ధర ప్రభుత్వం కల్పించాలని, బోయ వాల్మీకులను ఎస్‌టిలో చేర్చొద్దని, జీవో 3కు చట్టబద్ధత కల్పించాలని కమిటీ ఇవి సాధించేందుకు కృషి చేయాలని తీర్మానించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎం.రమణ, జిల్లా సహాయ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, మండలంలో గల గిరిజన సంఘం నాయకులు గిరిజనులు పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి - బెలగాం

శాఖాపరంగా అప్పజెప్పిన బాధ్యతలను క్షేత్ర స్థాయిలో సమర్ధవంతంగా నిర్వహించేందుకు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని జిల్లా ప్రణాళిక అధికారి పి.వీర్రాజు అన్నారు. స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశం మందిరంలో క్రాప్ శాంపిలింగ్ విధానంపై రెవెన్యూ సిబ్బందికి నిర్వహించనున్న ఏడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షపాతం నమోదు, రైతులు ఆయా ప్రాంతాల్లో పండించే సీజనల్ పంటలు ఎంత మేర సాగుచేస్తున్న విస్తీర్ణం నమోదు, పంట కోత ప్రయోగాలు తదితర అంశాలపై నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. అడంగల్ నమోదు, పంట దిగుబడి అంచనా, చిన్న, సన్నకారు రైతుల గుర్తింపు ఏ విధంగా సర్వే నిర్వహించాలన్నది పూర్తి స్థాయిలో అవగాహన అవసరమని స్పష్టం చేశారు. గ్రామ రెవెన్యూ పరిధిలోని సూక్ష్మ నీటి వనరులు, చెరువుల నీటి లభ్యత తదితర అంశాలపై పట్టు సాధించాలన్నారు. పరిశ్రమలు, జాతీయ ఆదాయ మార్గాలను రాబట్టడం వంటి విషయ పరిజ్ఞానాన్ని అవసరమని ఆయన పేర్కొన్నారు. అనంతరం నిపుణులతో శిక్షణ అందించారు. కార్యక్రమంలో గణాంక అధికారి కె.బి.అర్.ఆచార్యులు, శిక్షకులు వై.వి.సత్యనారాయణ, బి.చిన్నికృష్ణ, వెంకట రమణ, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార స్టాల్ ఏర్పాటు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

కొమరాడ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో మండలంలోని తోటపల్లిలో బుధవారం అంగన్వాడీ వర్కర్లు ఏర్పాటు చేసిన పౌష్టికాహారం స్టాల్‌ను ఎంపిడిఒ జి.పైడితల్లి, ఇఒపిఆర్‌డి ఎల్.గోపాలరావు, వైద్యాధికారులు డాక్టర్ పి.ఎ.ప్రియాంక, డాక్టర్ కార్తీక్ పరిశీలించారు. ఈ సందర్భంగా స్టాల్‌లో ప్రదర్శించిన పౌష్టికాహారానికి సంబంధించిన శెనగ చక్కీలు, బెల్లంఅరిసెలు, బాలామృతంతో చేసిన లడ్డూలు, నువ్వు ఉండలు, కూరగాయలు, ఆకుకూరలను పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో పైడితల్లి మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతల్లో రక్తహీనతను నివారించేందుకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని ప్రతి ఒక్కరూ తీసుకోవాలని కోరారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా వైయస్సార్ సంపూర్ణపోషణ, పోషణ ప్లస్ కార్యక్రమం కింద గర్భిణీలు, బాలింతలకు ఇంటింటికీ రేషన్ పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో పిహెచ్‌సి సిబ్బంది, అంగన్వాడీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతు ఇకెవైసి చేయించుకోవాలి : ఎడిఎ

ప్రజాశక్తి - సాలూరురూరల్

పంటలు పండించే ప్రతి రైతు తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకోవాలని సాలూరు వ్యవసాయ శాఖ ఎడిఎ ఎం.మధుసూదనరావు తెలిపారు. మండలంలోని సారిక పంచాయతీ దండిగాం వద్ద ఇకెవైసి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో మాదిరిగా కాకుండా ఈ సంవత్సరం అన్ని పంటలను సాగు చేస్తున్న రైతులంతా తమ పంటలను అమ్మాలన్నా ప్రభుత్వం అందించే పథకాలు లబ్ది పొందాలన్నా, తప్పనిసరిగా ఇకెవైసి చేయించాలని తెలిపారు. మండల వ్యవసాయ శాఖ అధికారి అనురాధపండా మాట్లాడుతూ మండలంలో 22వ సచివాలయం పరిధిలో మైదాన ప్రాంతంలో ఉన్న రైతులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారన్నారు. సిగ్నల్ లేని దగ్గర,హిల్ టాప్ ప్రాంత రైతులు వెనుక బడి ఉన్నారన్నారు. కురుకుట్టి, డెన్సా రాయి, సంపంగిపాడు, జిల్లేడు వలస, సారిక, గంజాయిభద్ర పంచాయతీ పరిధిలో ఉన్న రైతులు కొంత వెనకబడి ఉండడంతో బుధవారం సచివాలయంలో ఉండే పది మంది వ్యవసాయ సహాయకులతో సిగ్నల్ వున్న దండిగాం వద్ద ఆయా పంచాయతీల పరిధిలో ఉన్న రైతులందరికీ ముందుగానే చెప్పి ఇకెవైసి చేయించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు సాలూరు మండలంలో 10161 మంది రైతులుంటే 9541 మంది రైతులకు ఇకెవైసి చేయించామని, మిగతా 620 మంది రైతులతో బుధవారం సాయంత్రం లోపు జరిపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ప్రతినిధి రాజారావు, గ్రామవ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు చేయిస్తున్న సర్పంచ్ నాగేశ్వరరావు

సర్పంచ్ సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని గుజ్జువాయి పంచాయతీ పరిధిలో గల గుజ్జువాయి నుండి మంటికొండ వరకు సుమారు రెండు కిలోమీటర్లు రోడ్డు పూర్తిగా గుంతలమయం కావడంతో సర్పంచ్ హెచ్.నాగేశ్వరరావు బుధవారం సుమారుగా రూ.50వేలు తన సొంత నిధులతో గ్రావెల్ తెప్పించగా, చుట్టుపక్కల గ్రామాల గిరిజనులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రహదారి నుండే చినఅంటిజోల, డేరింగ్‌పాడు, నేరేడుమానుగూడ, మర్రిమానుగూడ, డెప్పిగూడ, బుగన్నగాడిగూడ, డాముగూడ, బట్టిగూడ, కొత్తగూడ, ఇప్పమాను గూడా, గొర్జంగూడ సుమారు 10 గిరిజన గ్రామాల్లో నివసిస్తున్న ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. రోడ్డు పూర్తిగా గుంతలమయం కావడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అంతేకాక అత్యవసర సమయంలో ఆరోగ్యం ఎవరిదైనా బాగులేకపోతే 108 వాహనం కూడా వెళ్లలేని పరిస్థితుల్లో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తన సొంత నిధులతో గ్రావెల్ తెప్పించగా ప్రజలంతా ముందుకు వచ్చి స్వచ్ఛందంగా సహకరించి గుమ్ములను కప్పడం జరిగిందని అన్నారు.

అపోహలు వీడి రీసర్వేకు సహకరించండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టంగా చేపట్టిన వైయస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా మీ స్థిరాస్తులకు సంబంధించి నివాస గృహాలు, ఖాళీ స్థలాలు, సాగు వ్యవసాయ భూముల రీ సర్వేకు ప్రజలంతా సహకరించాలని మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పి.నారాయణరావు అన్నారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు ఆదేశాల మేరకు 26వ వార్డులో సచివాలయాల అడ్మిన్లు, టౌన్ ప్లానింగ్ సెక్రెటరీలు, విఆర్ఒలతో కలిసి రీసర్వేపై ఆ వార్డు ప్రజలకు అవగాహన కల్పించారు. రీ సర్వేకి సంబంధించిన ఇంటి డాక్యుమెంట్, జిరాక్స్, ఇంటి పన్ను రసీదు, ఆధార్, జిరాక్స్ కాపీలను ఆయా సచివాలయాల సెక్రెటరీలకు అందజేస్తే వాటిని పరిశీలించి రీసర్వే నిర్వహించి ప్రభుత్వ ఆమోదంతో జగనన్న శాశ్వత భూ హక్కు భూరక్ష పట్టాదారు పాస్ పుస్తకాన్ని ఇవ్వడం జరుగతుందని అన్నారు. కార్యక్రమంలో సచివాలయం ఉద్యోగులు పవన్, ఉపేంద్ర, ప్రీతీ పావని, రాజేష్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే అఘాయిత్యాలకు అడ్డుకట్ట

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

సమాజంలో మహిళలకు జరుగుతున్న అఘాయిత్యాలు, మానభంగాలు, అవమానాలను విద్య ద్వారానే అరికట్టుకోవచ్చని స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి. శ్రీవరం అన్నారు. బుధవారం స్థానిక డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ ఆడపిల్లల దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడారు. మహిళలు విజ్ఞానవంతులైతే ఎట్టి పరిస్థితుల్లోనూ ఇటువంటి అఘాయిత్యాలు జరిగేందుకు ఆస్కారం ఉండదన్నారు. నేడు ప్రపంచంలో ఏ రంగంలోనైనా ఆడవాళ్లు తమదైన ప్రతిభతో, శక్తితో ముందుకు దూసుకుపోతున్నారని గుర్తు చేశారు. ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కోఆర్డినేటర్ జి.శ్రీలక్ష్మి మాట్లాడుతూ, విద్యార్థులంతా చక్కగా చదువుకొని జీవితాలను బాగు చేసుకుంటూ ఒక ఆదర్శవంతమైన సమాజం తయారవుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డి.రామయ్య, అధ్యాపకులు కల్పన, తదితరులు పాల్గొన్నారు.

మారుమూల ప్రజలకు వైద్య సేవలు అందించాలి

ప్రజాశక్తి - కొమరాడ

మారుమూల ప్రజలకు వైద్యశాల సక్రమంగా అందించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని బొడ్డవలసలో బుధవారం ఆయన సందర్శించి అక్కడ టీకా నిర్వహణ, చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య పర్యవేక్షణ చేశారు. గ్రామంలో ఉన్న ఐదేళ్లలోపు పిల్లల జాబితాను, రికార్డులు, టీకా కార్డులను పరిశీలించి ఏ మేరకు టీకా నిర్వహణ జరిగిందో పరిశీలిం చారు. చిన్నారులకు టీకా చుక్కలు వేశారు. పిల్లల ఆరోగ్య పరిశీలన చేసి, సిబ్బందికి, తల్లిదండ్రులకు సూచనలు ఇచ్చారు. బాలింతలు విధిగా అంగన్వాడీ కేంద్రంలో అందజేస్తున్న పౌష్టికాహారం, ఐరన్ మాత్రలు ప్రతి రోజూ వినియోగించడం వల్ల ఆరోగ్యంగా ఉండగలరని తద్వారా బిడ్డకు తల్లి పాలు అందించవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఎఎన్ఎం శారద, హెల్త్ అసిస్టెంట్ అప్పలనాయుడు, ఆశా కార్యకర్తల తదితరులు పాల్గొన్నారు.

జిల్లేడు కషాయంతో పోషకాలు సమృద్ధి

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

జిల్లేడు కషాయంతో పోషకాలు సమృద్ధిగా లభిస్తాయని ఈ మేరకు రైతులు గ్రహించి తమ పంటలకు జిల్లేడు కషాయాన్ని వాడాలని జిల్లా ప్రకృతి వ్యవసాయం మేనేజర్ పి.షణ్ముఖరాజు తెలిపారు. మండలంలోని పి.ఆమిటిలో పొలం బడి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు పావని, మండల ఇన్‌ఛార్జి ఎం.సీతారాం, పి.ప్రసాద్, గణేష్ ,రవి, రైతులు పాల్గొన్నారు.

అధ్వాహ రహదారిపై ఎన్ని రోజులు ప్రయాణం?

ప్రజాశక్తి -కొమరాడ

ఆంధ్రా- ఒడిశా అంతర్‌రాష్ట్ర రహదారి అధ్వానంగా మారిందని, ఈ రహదారిపై ఎన్నిరోజులు ప్రమాదకర ప్రయాణాలు చేయాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కొమరాడలో అధ్వానంగా తయారైన అంతరాష్ట్ర రహదారిపై సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ మండల కేంద్రానికి సమీపంలో రైస్‌మిల్ వద్ద, ఈశ్వరుని ఆలయం వద్ద, కొత్తూరు, గాంధీనగరం, కోనేరు వద్ద గల అంతరాష్ట్ర రహదారి మార్గంలో ఉన్న గోతులను కప్పాలని డిమాండ్ చేశారు. అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని, లేకుంటే ఈ గోతుల వద్ద నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

సెలవులకు ముందే విద్యార్థుల ఇంటి బాట

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని టిక్కబాయి గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ముందుగా దసరా సెలవులు ఇవ్వడం హెచ్ఎం, వార్డెన్ల సొంత నిర్ణయమా, ఉన్నత అధికారులు ఆదేశాల అర్థం కావడం లేదని ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు రొబ్బా లోవరాజు అన్నారు. ప్రభుత్వం ఈనెల 14 నుంచి దసరా సెలవులు ప్రకటించినప్పటికీ టిక్కబాయి పాఠశాల మాత్రం బుధవారం నుంచే సెలవులు ప్రకటించి సగం మంది విద్యార్థులను ఇంటికి పంపించారని తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులను అడగ్గా తమకు ఎటువంటి సమాచారం లేదన్నారు. తప్పు జరిగితే హెచ్ఎం, వార్డెన్‌పై చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారన్నారు. విద్యార్థులు ఇంటిబాట పట్టడంపై హెచ్ఎం జ్ఞానప్రకాష్‌ను వివరణ కోరగా తల్లిదండ్రులు కలిసి విద్యార్థులను ఇంటికి వెళ్లొద్దని ఎంత చెప్పినా వినలేదని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి

ప్రజాశక్తి - కురుపాం

ప్రకృతి వ్యవసాయంతో రైతులు అధిక దిగుబడి సాధించ వచ్చని ప్రకృతి వ్యవసాయ విభాగ సిబ్బంది జి.తిరుపతిరావు, ఎస్.భాస్కర రావు అన్నారు. మండలంలోని రస్తా కుంటుబాయిలో మహిళా సంఘాల సభ్యులతో జిల్లేడు కషాయం తయారీపై అవగాహన కల్పించారు.ఈ కషాయం వరి పంటలో పిచికారీ చేయడం వల్ల ఫాటోస్‌కు అయిన ఖర్చు మిగులుతుందని కావున రైతులంతా ప్రకృతి వ్యవసాయం చేయాలన్నారు. కార్యక్రమంలో రైతులు, మహిళా సంఘాలు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

In the Honourable Court of the 2nd Additional District Judge Parvatipuram
I.A. 321/202 in O.S. 05/2022 (Section 5 of IL Act) I.A. 322/2023 in O.S. 05/2022 (Or.9 R.9 CPC)

Between:
Pugaku Murali Krishna
....Petitioner/ Plaintiff
And:
Karri Neelakantham and others
......Respondents/Defendants
To,
R12. Killadi Kiran Kumar S/o Prakasharao, D.No 1-88, Gummada village, Komarada Mandal, Parvatipuram Manyam District.

Take notice that the above petitioner has filed two petitions seeking to set aside the dismissal order Dt. 15.02.2023 passed against the 12th defendant in the suit and to condone the delay in filing the default order set aside petition and the said two petitions have been posted to **18.10.2023** for your appearance before the above court at **10.30 am.**

Take notice that if you fail to attend the court on the day above mentioned either in person or through an authorized person, the matter will be heard and determined in your absence.

//By order of the Court//
P. Rajeswara Rao
Advocate, PARVATIPURAM
Parvatipuram
Dt. 12.10.2023